


**(క్రిందటి సంచిక తరువాయి)**

## 8

**ఒక్కణ్ణే ఎలాగా చావు దెబ్బ కొట్టచ్చు.** అది చూసి రెండోవాడు తిరగబడకుండా ఉండాలంటే కూర్చుని ఉన్నప్పుడే సరైన అదను. అంతే! క్షణం ఆలస్యం చేయకుండా మెల్లిగా వారి వెనకాలకి వచ్చి కట్టెతో ఒకడి తలమీద బలంగా కొట్టాడు.

చిన్నకేక వేస్తూ వాడు పడిపోగానే జరిగిందేంటో తెలుసుకునేందుకూ, తెలుసుకుని లేచి నిల్చునేందుకూ కొద్ది సమయం పట్టింది. ఆ సమయాన్ని వినియోగించుకున్న అతను మరి వాడిని లేవనీయలేదు. `ఫట్`మంటూ వాడి తలపై దెబ్బపడింది. సందేహనివృత్తి కోసం చెరోటి మళ్ళీ ఇచ్చుకుని, వేస్ట్ బాక్స్ గుమ్మరించి, ఎర్రరంగు కవరు అందుకుని తనకి సాయం చేసిన టార్చిలైట్‌ని వాళ్ళ దగ్గరే పడేసి, బైటపడ్డాడు. బైట తలుపులు లాగి గడియవేసి సెక్యూరిటీ వేపు గబగబ అడుగులు వేయసాగాడు.

●●●

"ఏమంటున్నాడు ఆ నరాంతకుడు?" మర్నాడు చంద్రశేఖర్‌ని అడిగాడు రామారావు.

"ఏముందీ? ఆ రెండు కోట్లు తానే ఇస్తానని ఫోటోలు, నెగెటివ్స్ ఇవ్వమంటున్నాడు"

"నా వల్ల మీకు కలిగిన నష్టం పూడిందనుకుంటాను. "

"నష్టంలేదు. ఇపుడంతా లాభమే"

"సరేనండీ! నేనిక వెళ్ళొస్తాను"

"ఏమిటి? ఈ రోజు శలవు పెడుతున్నావా?"

ఓ క్షణం ఆగి అన్నాడు రామారావు. "ఔను. ఇంక శాశ్వతంగా శలవు తీసుకుంటున్నాను."

"ఏమిటీ?"

"ఔను. ఉద్యోగం మానేస్తున్నాను."

"కారణం?"

"దయచేసి అది మాత్రం అడగొద్దు"

"రామారావ్. ప్లీజ్ నువ్వలా మాట్లాడద్దు. నేనేమైనా తప్పు చేస్తే చెప్పు. నా తప్పు దిద్దుకుంటాను."

"సర్! నే వెళ్తూ వెళ్తూ మీమీద అలాంటి నేరం మోపలేను"

"పోనీ. నేనేమైనా అన్నానా?"

"రామారావు ఆయన చేతులు పట్టుకుని "ప్లీజ్! సర్.. మీరలా మాట్లాడకండి. మీకు నా వల్ల కోట్లలో నష్టం వచ్చిందని తెలిసినరోజు కూడా నన్ను పల్లెత్తు మాట అనలేదు మీరు"

"మరెందుకు వెళ్తున్నావ్?"

"ఇక్కడ ఎన్ని అపాయాలు పొంచి ఉంటాయో నాకు తెలిసివచ్చింది. నాలాగ ఆత్మీయులు ఎక్కువమంది కలిగినవారికి ఇలాంటి ఉద్యోగాలు పనికిరావు. ఆనాడు ఆ స్థితిలో నా స్నేహితుని భార్య తల్లిదండ్రులున్నా నేనలాగే పరుగెత్తుతాను. అలాంటి నాకు ఇలాంటి బాధ్యతలతో కూడిన ఉద్యోగం కూడదు. ఆ రోజు ఆ సమయానికి నేను 'అక్కడ' ఉన్నాను గనక మీకు నష్టం తప్పింది. లేదంటే భారీ నష్టం. ఇరవై కోట్లు. మావంటి వారు లక్ష ఒకేసారి చూడ్డం అరుదు."

ఊపిరి తీసుకోవడానికి ఆగాడు. "అలాంటిది ఇరవై కోట్లు నావారినీ, నా బంధుమిత్రులందరినీ, వారి ఆస్తిపాస్తులతో సహా అమ్మినా అంతడబ్బు రాదు. అలాంటి నాకు ఉలాంటి రిస్క్ ఉద్యోగం సరిపడదని తెలుసుకున్నాను. అందుకే మానేస్తున్నాను" చేతులు జోడించి వెనుతిరిగాడు. అతని కళ్ళలో నీళ్ళు. చంద్రశేఖర్ కూడా కళ్ళు తుడుచుకున్నాడు.

తిరిగి వెనక్కి వచ్చాడు.

"రామారావ్ ఏంటయ్యాఇది?!" అన్నాడు.

"ఇంటికి వచ్చి, ఉద్యోగం ఇచ్చిన మిమ్మల్ని ఎపుడూ మరువలేను" వెనుతిరగబోయాడు.

"ఏదో ఒకరోజు నువ్వు నామీద అలిగి వెళ్ళిపోతావని నేను ముందుగానే ఊహించాను. నిన్ను డిగ్రీ కూడా పూర్తి చేయనీకుండా ఉద్యోగంలో చేర్చుకున్నాను"

"కానీ నేను డిగ్రీ పూర్తి చేశాను"

"అది నీ ప్రతిభ మాత్రమే. నీ భవిష్యత్తుని పూర్తిగా వికసింపచేయనివ్వలేదు నేను. అందుకే నీ లైఫ్ సెక్యూరిటీ కోసం నీ పేరున బ్యాంక్‌లో డబ్బు వేశాను.. ఇవిగో.. తీసుకో"

"వద్దు సర్"

"అలా అనకు. ఇది నీకు మాత్రమే చెందుతుంది."

మాట్లాడకుండా తీసుకున్నాడు.

"శకుంతలని తీసేసానని అలిగి వెళ్తున్నావ్ కదూ?"

"అదీ కొంత కారణమేమో. తప్పు మా ఇద్దరిదీ. దండన ఆమెకే ఎందుకు? ఆమె లేకున్నా మీ పత్రిక నడుస్తుందనే నమ్మకం మీకుంది. నే లేకున్నా మీ పత్రికకి ఏలోటూ రాదని చెప్పడానికే, మీకు తెలీడానికే నే వెళ్తున్నాను.

"కానీ ఆమెని నేను తీసేయలేదు. బాధ్యతా రహితంగా ప్రవర్తించిందని కాస్త గట్టిగా మందలించాను."

"ఆమె ఏమన్నారు?"

"ఆమె కారణాలు ఆమెకుంటాయి. ఇక్కడ కారణాలు కాదు కావల్సింది బాధ్యత. ఆమె ఏదో చెప్పబోయింది నే వినిపించుకోలేదు"

"సర్! వస్తానిక"

బయటికొచ్చేశాడు.

ఇంటికి వెళ్ళాలనిపించలేదు. రోడ్డు మీద నడుస్తున్నాడు. అంతలో 'శకుంతలగారింటికి వెళితే?' అనిపించింది. ఆమె చెప్పిన ఫోన్ నెంబర్ జ్ఞాపకాల మరుగున పడిపోయింది. పదినిమిషాలు ఆలోచించగా గుర్తుకొచ్చింది. ఫోన్ చేశాడు.

"హలో" అంది.

"మేడం. నేను రామారావుని. మీరు తీరికగా ఉంటే మీతో కొంచెం మాట్లాడాలని .. మీకు అభ్యంతరం లేకుంటే మీ ఇంటికి రావాలని"

"అదేం మాట? తప్పకరండి" ఇంటి చిరునామా, గుర్తులూ చెప్పింది.

బైక్ తేలేదు. అందుకే ఆటోలో బైలుదేరాడు. ఆటో ముందుకీ, ఆలోచనలు వెనక్కీ వెడుతున్నాయి. 'చేస్తున్న ఉద్యోగాన్ని విడిచి రావడం అంత తెలికేం కాదు' అనుకున్నాడు.

"రండి" అంది శకుంతల. ఆమె అతని కోసం ఎదురుచూస్తూ ఉంది. ఇల్లు మామూలుగానే ఉంది. దాన్ని సర్దిన తీరు గొప్పగా ఉంది.

"ఆరోగ్యం ఎలా ఉంది?" అడిగింది కాఫీ ఇస్తూ.

"బాగానే ఉంది" అన్నాడు.

"ఆఫీసు విశేషాలు చెప్పండి" అంది.

"ఏమున్నాయండీ. అన్నీ ఓ.కే"

కాస్సేపు ఆ కబుర్లూ, ఈ కబుర్లూ మాట్లాడుకున్నాక "వస్తానండీ" అంటూ లేచాడు.

వెళ్ళబోతూ ఆగి ప్రశ్నించాడు. "చంద్రశేఖర్‌గారు మిమ్మల్ని మళ్ళీ ఆహ్వానిస్తే తిరిగి ఆ ఉద్యోగంలో చేరతారా?" అని.

సమాధానం కోసం ఓ నిమిషం ఆగిందామె. "నిజానికాయన నన్ను కేకలేశారు తప్పితే తీసెయ్యలేదు. నాకే అనిపించింది.. అది చాలా పెద్ద పత్రిక. అందరి దృష్టీ దానిమీదే ఉంటుంది. శత్రువులు ఎక్కువ. రిస్కూ కూడా ఎక్కువే. మనచిన్న తప్పు ఆయనకి కోట్లలో నష్టం తేగలదు. అందుకని నా స్థాయి పత్రికని చూసుకోవడం బెటరనిపించింది. అందుకే అలాంటి ఉద్యోగం వద్దనుకున్నాను" అంది.

"ఈమె ఆలోచనలన్నీ నా ఆలోచనలాగున్నాయే" అనుకుని 'వస్తానండీ" అంటూ వెనుతిరిగాడు. గుమ్మంలో ఓ యువతి ఎదురైంది. ఆమెని ఆశ్చర్యంగా చూస్తూ పక్కకి తప్పుకున్నాడు.

శకుంతల అంది "రామారావుగారూ! మా అమ్మాయి చంద్రబింబ.. చంద్రా! వీరు రామారావుగారు" అంటూ పరిచయం చేసింది. ఆమె నిజంగానే చంద్రబింబంలా ఉంది. నమస్కార, ప్రతినమస్కారాలయ్యాక బైటపడ్డాడు రామారావు.

ఆ తరువాత మళ్ళీ ఎప్పుడూ శకుంతల ఇంటికి వెళ్ళలేదతను. తనుగా ఆమెకి ఫోను కూడా చేయలేదు. ఇంటికి వచ్చిన రామారావు తాను ఉద్యోగం మానేశానని ఇంట్లో చెప్పలేదు. 'సిరియాళ్ ఉన్నాడు కదా? చెబుతాడు' అనుకున్నాడు. విచిత్రం ఏమంటే సిరియాళ్ చెప్పిన తరువాత కూడా ఉద్యోగం గురించి ఎవరూ అతన్ని అడగలేదు. "దాదాపు ఇరవైరోజులు రాత్రింబవళ్ళు పనిచేసిన నాకు ఏమీ కాలేదు. ఆ ప్రభావం ఇంట్లో వారిమీద చాలా చూపించింది' అనుకున్నాడు. తనకి నచ్చిన తెలుగు సాహిత్యాన్నంతా తెచ్చేసుకున్నాడు. దాంతోనే అతనికిప్పుడు సమయం వేగంగా గడుస్తోంది.

●●●

"సార్! పెద్దసారు రమ్మంటున్నారు" ప్యూన్.

"వస్తున్నాను" అంటూ చేతిలో కాగితాలు పక్కనపెట్టి పెద్ద బాస్ గదిలోకి నడిచాడు సూర్యం.

"సర్! పిలిచారట" అన్నాడు.

ఆయన తలూపాడు. సూర్యం అలాగే నిల్చుని ఉన్నాడు. ఐదు నిమిషాలపాటు ఆయన ఏకాగ్రతతో ఏదో రాసి ప్రక్కనపెట్టి "రేపు ఈ ఫైల్ పనేంటో చూడాల్సింది నీదేనయ్యా" అన్నాడు.

"సరే సార్"

"ఇదిగో రేపు నువ్వు చేయాల్సిన పనుల లిస్ట్ వ్రాసి పెట్టాను" అంటూ చిన్న కాగితం అందిస్తూ "రేపు నేను రావడంలేదు. తెలుసుకదా?" అన్నాడు.

"తెలుసు సర్."

"చాలాసార్లు చెప్పి ఉంటానుగదూ? చాలా టెన్షన్ పడుతున్నాను. నాకు కావల్సిన కాండిడేట్ దొరుకుతాడో దొరకడో అని. ఐనా ఇంకా ఏం చేయగలను చెప్పు? నా ప్రయత్నాలు నే చేస్తాను. ఆ పైన పైవాడి దయ"

"అంతే సర్"

"అవును సూర్యం. నేనెప్పుడూ నీ పర్సనల్ విషయాలు అడగలేదు. నీకు పిల్లలు ఎంతమంది?"

"ఒక బాబు సర్"

"అలాగా? ఏం చేస్తుంటాడు"

"ప్రస్తుతం ఏమీ చేయడం లేదుసార్"

"పొరపాటు చేశావయ్యా! మీ అబ్బాయి అంటే నీలాంటి నిజాయితీపరుడే ఐ ఉంటాడు. నాకా నమ్మకం ఉంది. అతనితో గ్రూప్స్ రాయించి ఉండాల్సింది. అప్పుడు ఇంత శ్రమపడి ఉండేవాణ్ణికాను"

"ఏమయింది సర్?"

"విను. మొన్నొకరోజు మన మినిస్టర్ గారు నన్ను పిలిచారు. ' గోపాలకృష్ణగారూ! మీ రిటైర్మెంట్ దగ్గరిలో ఉంది కదూ?' అన్నారు. అవునన్నాను. 'మీ పదవీ విరమణ లోపుల మీలాంటి ఓ వ్యక్తిని సెలక్ట్ చేయండి. మీ ఆఫీసులో ఓ పోస్ట్ ఖాళీగా ఉంది కదా? అందులోకి' అన్నాడు. నేను అయోమయంగా చూశాను. అప్పుడాయనన్నారు.

'గోపాలకృష్ణగారూ నిజాయితీ కలిగిన వ్యక్తి శాఖాహార జంతువు వంటివారు. మాంసాహారాన్ని తీసుకునే జంతువులైనా శాఖాహార జీవిని ఇష్టపడతాయి తాను దుర్మార్గుడుగా ప్రవర్తించినవాడు కూడా ఎదుటివాడు సన్మార్గుడై ఉండాలని కోరుకుంటాడు. మీ మనసులో మీరిప్పుడు అనుకుంటూ ఉండచ్చు. - మీరింతగా చెబుతున్నారు. మీరీ మంత్రి పదవికి రావడానికి మీరు నిజాయితీగా, నీతిగా ఉండగలిగారా? - అని. ఈ రోజుల్లో అది అసాధ్యమన్నది లోకమెరిగిన రహస్యం. ఐతే మా నాన్నగారు మీ డిపార్ట్‌మెంట్‌లోనే నిజాయితీతో పనిచేసి రిటైరైనారు. ఆయన నిజాయితీనే నన్నింత వాడిని చేసిందని నా నమ్మకం. అందుకే మీ డిపార్ట్‌మెంట్ అంటే నాకు చాలా ఇష్టం. అందుకే కోరి ఈ విభాగాన్ని ఎన్నుకున్నాను. నా అదృష్టం ఏమంటే మీరు కూడా మా నాన్నగారు వంటి వ్యక్తికావడం. మిమ్మల్ని గురించి వినీ, తెలుసుకున్న నా ఆనందం అంతా ఇంతా కాదు. ఐతే త్వరలో మీరు రిటైవవబోతున్నారు. మీ స్థానంలోకి ఎవరో ఒకరు వస్తారు. కానీ మీరుండగా, మీ పర్యవేక్షణలో ఓ యువకుడిని ఎన్నిక చేయండి. కుల, మత, వర్గాలకు ఈ ఎన్నిక జరగాలి. నే చేసిన మంచి పనుల్లో ఇదొకటి అనిపించాలి' అన్నారు. కనుక నేనింతగా టెన్షన్ పడుతున్నాను. ఒకవేళ మీ అబ్బాయి అయితే నాకీ శ్రమా, ఆదుర్దా ఉండేదికాదని అలా అన్నాను. ఏమనుకోకు"

"అబ్బే ఏం లేదుసార్!"

"ఇంతకీ మీ అబ్బాయిని గురించి చెప్పు. ఉద్యోగం చేసేవాడన్నావ్. ఎందుకు మానేశాడు?"

"తన సహోద్యోగిని ఉద్యోగంలోనుండి తీసేశారని అలిగి తాను మానేశాడు"

"అబ్బో! చరిత్ర ఘనంగానే ఉందే! ఇంతకీ ఎక్కడ పని చేసేవాడు?"

"పత్రిక ఆఫీసులో"

"ఏ పత్రిక?"

"తొలిసంధ్య"

"డిగ్రీ చేసిన వాడికి `తొలిసంధ్య`లో ఉద్యోగం ఎలా వచ్చింది?"

"డిగ్రీ పూర్తి చేయకుండానే వచ్చింది సర్. చంద్రశేఖర్‌గారు ఇంటికి నచ్చి పిల్చుకు వెళ్ళారు"

"కొంపతీసి మీ అబ్బాయి పేరు రామారావు కాదుగదా?"

"వాడిపేరు అదే సర్"

"అంతేనయ్యా! నత్తగుల్లలన్నీ ఒకచోట, రత్నాలనీ ఒకచోట.. అనేది మా నానమ్మ. మంచివాళ్ళు, నిజాయితీపరులు లేరు. ఉన్నవాళ్ళనిలా నా మిత్రుడు చంద్రశేఖర్ లాంటి వాళ్ళు లాగేసుకుంటారు. ఇక మన డిపార్ట్‌మెంట్‌కి ఎలా దొరుకుతారు? ఐనా డిగ్రీ కూడా చేయలేదా?"

"అక్కడ ఉద్యోగం చేస్తూ డిగ్రీపూర్తి చేశాడు"

"ఆ రామారావు గురించి చాలా విన్నాను. కానీ ఏం చేస్తాం. అందని ద్రాక్షపండు వదిలేయ్"

"వస్తా సార్" వెనుతిరిగాడు సూర్యం.

●●●

"తాతయ్యా! నేను గవర్నమెంట్ ఉద్యోగం చేయాలనుకుంటున్నాను. నీ సలహా ఏమిటి? "

"హతోస్మి. వాళ్ళనా దేవుడే కాపాడాలి"

"ఎవరిని?"

"నువ్వు ఏ డిపార్ట్‌మెంట్లో చేరతావో వాళ్ళని"

"నేనంత చెడ్డవాణ్ణేంటి?"

"నీ ప్రక్కన చెడ్డవాళ్ళు నిలువగలుగుతారేంటి?"

"సరే ఏమంటావిప్పుడు?"

"నీకా ఉద్యోగం దొరికేనా.. పెట్టేనా? దానికి గ్రూప్ ఎగ్జామ్స్ రాయాలి, అందులో తగినన్ని మార్కులు రావాలి. ఇంటర్వ్యూలకి వెళ్ళాలి. అక్కడ ఇంటర్వ్యూలో నెగ్గాలి. అప్పుడు కద ఉద్యోగం మాట"

"అవన్నీ అయ్యాయి. రేపు ఫైనల్ ఇంటర్వ్యూ ఉంది. కాస్త త్వరగా నిద్రలేపు. గుడ్ నైట్"

అంతే ప్రేక్షకులు ముగ్గురికీ (సూర్యం, జయ, తాతగారికి) నక్షత్రాలు కనిపించాయి సూర్యం తలపైకెత్తి దేవుడికి కృతజ్ఞతా పూర్వకమైన సలాం చేశాడు.

●●●

తన పేరు పిలవగానే చిరునవ్వుతో లోపల అడుగుపెట్టాడు రామారావు. వాళ్ళడిగిన అన్ని ప్రశ్నలకూ సమాధానం చెప్పాడు. ఓ ప్రశ్ననే సవరించి అది ఇలా ఉండాలి. అలా కాదు. అంటూ జవాబు కూడా చెప్పాడు. సబ్జెక్ట్‌కి సంబంధించిన ఇంటర్వ్యూ ముగిసింది. అంతే మరో వ్యక్తి అందుకున్నాడు.

"మిస్టర్ రామారావ్! మీ గురించిన మీ అభిప్రాయం చెప్పండి" అన్నాడు. అతను విస్మయంగా చూశాడు. అక్షరాలని కూడదీసుకోవడానికి, భావాలని సర్దుకోవడానికి అన్నట్టుగా ఓ నిమిషం ఆగాడు.

"చాల క్లిష్టమైన ప్రశ్న వేశారు. నాకు ఊహ తెలిసినప్పటినుండి నేనేమిటో తెలుసుకునే ప్రయత్నం చేస్తూనే ఉన్నాను. నన్ను గురించిన నా అభిప్రాయం రోజుకో రకంగా, పూటకో తీరుగా రంగులు మారుతూ కనిపిస్తూ ఉంది. అందుకే నేనేంటో నేను తెలుసుకోలేకపోతున్నాను.

ఎప్పుడూ నాతో నేనుంటాను. ఐనా ఏదో అసంతృప్తి.

ప్రతీక్షణం నాకై నేను జీవిస్తాను. కానీ ఏదో అపశృతి.

నిరంతరం నాలోకి నేను చూసుకుంటాను. ఐనా ఏదో అస్పృశ్యత.

నిత్యం నాదైన శైలిలో ప్రవర్తిస్తాను. ఐనా కరువైన ఆత్మస్పందన. నేనేంటో నాకే తెలీదు. మీకు నన్ను గురించి ఏమని చెప్పుకోను? 'స్వ'పరిచయం ఎలా చేయగలను? ఏమని తెలియజేయగలను. క్షమించండి"

"మీ ప్రియనేస్తం ఎవరు? వీడాలనిపించే శత్రువు ఎవరు?"

"ప్రియనేస్తం అంతరాత్మ. శత్రువు మనస్సు"

"మీకు ఇష్టమైన భాష ఏంటి?"

"సంస్కృతం"

"ధనం మూలమిదం జగత్. ఇదొక సామెతా, నినాదమా? లోకోక్తా?"

"ఇది సంస్కృత శ్లోకం -వేదామూల మిదంకావ్యం - భార్య మూలమిదం గృహం

కృషి మూలమిద సేద్యం - ధనం మూలమిదం జగత్. ఇదీ పూర్తి శ్లోకం"

"గుడ్ మీరిక వెళ్ళచ్చు"

"థాంక్యూ"

●●●

అలా రామారావుని గవర్నమెంట్ గుమస్తాగిరి వరించింది. అదే ఆఫీసులో పనిచేస్తున్న సూర్యాన్ని సిటీకి కొద్ది దూరంలో ఉన్న మరో బ్రాంచి ఆఫీసుకి ట్రాన్స్ఫర్ చేశారు. అతను ఉద్యోగంలో చేరాక అడిగింది మేఘ" అత్తయ్యా! బావపుట్టినరోజు ఎప్పుడు?" అని.

రామారావు తొలిసంధ్యలో ఉద్యోగం మానడం అందరికీ బాధగా ఉంది. 'ఎందుకు మానావు?' అనిఅడిగే ధైర్యం ఎవరికీలేదు. ఎప్పుడూ పుస్తకాలు ముందరేసుక్కూర్చోవడం, పలక్కపోవడం అందరికీ అదో లోటుగా అనిపించింది.

"మళ్ళీ బావ ఉద్యోగంలో చేరడంతో నా ప్రాణానికి హాయిగా ఉంది" అంది.

"ఏం మహాతల్లీ! నా ఉద్యోగానికీ, నీ హాయికీ సంబంధం ఏంటి?"

"చాలా ఉంది. ఎప్పుడూ వండుకు తినడం, ఉద్యోగాలు చేసుకోవడం, నిద్రపోవడం ఇదేనా జీవితమంటే? సరదా, సంతోషం, కబుర్లు, అరుపులు, గోల ఇవి కూడా ఉండాలి. నువ్వు ఉద్యోగం మానాక కొంపలంటుకుపోయినట్టు సీరియస్ ముఖంతో ఉండేవాడివి. అందుకే మేమంతా డల్ గా ఐపోయాం."

"అలా ఉండడం నాది తప్పే. కానీ మీ అందరికేమొచ్చింది? మీరైనా సరదాగా ఉండచ్చుకదా!"

"చెప్పాగా బావా? నువ్వు కేంద్ర బిందువని. బిందువు వెలవెల పోయింది. అందుకే వలయం విలవిలలాడింది. ఇప్పుడు బిందువు కిలకిలలాడుతున్నది. వలయం కళకళలాడనుంది"

"బాబోయ్ పెద్ద బిరుదే"

"ఎందుకమ్మా?"

"ఎందుకేంటి? ఆ రోజు అందరం శలవు పెట్టేసి గండిపేట వెళ్దాం. మా బాస్‌ని వ్యాన్ కూడా అడిగాను. ఆ రోజు తిండి ఖర్చులన్నీ ఈ గవర్నమెంట్ గుమాస్తాగారు భరిస్తారు."

"అలాగేలే. నువ్వు ముందుండి అన్ని ఏర్పాట్లు చెయ్యి. డబ్బుదేముంది? మీ బావే చూసుకుంటాడు" అంది జయ.

అనుకున్న ఆ రోజు రానే వచ్చింది. మేఘ అన్నీ సిద్ధం చేసింది. అంతా శలవుపెట్టారు. వ్యాన్‌లో గండిపేట చేరారు. కానీ ఆ రోజు ఏదో సినిమా షూటింగ్ ఉందిట. జనం చాలా మంది ఉన్నారు. ఆ రద్దీని తట్టుకోలేక అక్కడనుండి బైలుదేరి జూ పార్క్ చేరారు.

మేఘ ఆధ్వర్యంలో అందరికీ టిఫిన్లూ, కాఫీలు అందాయి. కూల్ డ్రింక్స్, పండ్లు, ఐస్ క్రీం ఒకటేంటి? చిరుతిండికి లోటులేకుండా తీసుకొచ్చింది. చెత్తబుట్టనుండి, స్ట్రావరకు అన్నీ, ఇది లేదనకుండా అమర్చింది. 'ఎలాగైనా మేఘ తెలివైనది' అంది జయ.

"మేఘా!నిన్ను పెళ్ళాడబోయే అతను ఎవరో ఏమో బంగారు పూల పుజచేస్తున్నాడు దేవుడికి" అంది శివ వాళ్ళమ్మ సిరియాళ్ వంక ఓరగా చూస్తూ. అప్పటికి వాళ్ళంతా ఓ చెట్టుక్రింద కూర్చున్నారు.

●●●

పచ్చగా విరగబూసిన ఆ చెట్టుపూలు అంబరీష్ తెచ్చి కుప్పలుగా సిరియాళ్ దగ్గర పోస్తున్నాడు. వాటిని శివలింగాకారంలో కత్తిరించిన ఓ క్రోటన్ చెట్టుకి విసిరేస్తున్నాడు సిరియాళ్. ఆమె మాటతో గతుక్కుమన్నాడతను. పూలువేయడం ఆపేశాడు. అంతా చూసీ చూడనట్టు చూసి, నవ్వీ నవ్వనట్టు చిరునవ్వులు నవ్వాడు.

"సిరియాళ్ జీ!"

"జీ" అసలే ఇరుకున పడినట్టున్న సిరియాళ్ పరిస్థితి కుడితిలో పడినట్టయింది. అందుకే జవాబు నీరసంగా వచ్చింది.

"పెళ్ళి అంటే?" అడిగాడు అంబరీష.

"పెళ్ళి అంటే ఏం లేదు. చిన్నతనంలో మనం చేసిన వెధవ పనులకు - పెరిగిన తరువాత పెద్దవాళ్ళు వేసే కఠిన శిక్ష" అతని మాటలకు అంతా నవ్వారు. మేఘ మాత్రం కోపంగా చూసింది. తీరా చెప్పాక అనుకున్నాడు 'అమ్మయ్య ఇన్నిరోజులకి మేఘ ఉడుక్కునే సమాధానం చెప్పాను' అని.

"ఏంటయ్యా! పెళ్ళి మీద జోకులేస్తున్నావు? ఇంకా పెళ్ళి ఎప్పుడు చేసుకుంటావో, మాకు పప్పన్నం ఎప్పుడు పెడతావో అని మేం చూస్తుంటే" అంది దివ్య.

"సిరియాళ్ జీ"

"జీ"

"పప్పన్నం అంటే?"

"పప్పన్నం అంటే ఏం లేదు. పెళ్ళి అనే తంతుకి పర్యాయపదంలే ఊరుకో"

"ఏంటబ్బాయ్ ఎన్నడూ లేనిది పిల్లాడినలా కసురుతావు? జీవితంలో పెళ్ళే చేసుకోవా? ఎన్నాళ్ళు తమ్ముడిని తోకలా వెంటేసుకు తిరుగుతావు? మీ అమ్మగారికి కాస్త నెమ్మదించింది కదా? ఈ స్వయంపాకాలు, వంట పుస్తకాలు ప్రక్కన పడేసి గుణవతి అయిన భార్యని తెచ్చుకో" అన్నారు తాతగారు.

"సిరియాళ్ జీ"

"జీ"

"భార్య అంటే?"

"భార్య అంటే ఏం లేదు. జీవితంపై మమకారం కలిగినపుడు మణిహారంగానూ, విరక్తి కలిగినప్పుడు మారణాయుధంగానూ పనికొచ్చే వజ్రం" సరిగ్గా అదే సమయానికి అంబరీష్‌కి ఐస్ క్రీం అందించడానికి చేయి సాచిన మేఘ అంది

"అంబరీష్ జీ"

"జీ"

"భార్య అంటే?"

"భార్య అంటే ఏం లేదు జీవితంపై విరక్తి కలిగినప్పుడు అనురక్తినీ, అనురక్తి కలిగినప్పుడు ఆహ్లాదాన్ని పంచే ఏకైక మిత్రురాలు" తెలిసిందా?" అడిగింది.

"తెలిసిందండీ! సిరియాళ్ జీ చెప్పిన మాటకంటే మీ మాటే బాగుందండీ"

"మా అక్కయ్యంతే - అచ్చుల్లో మేఘ. హల్లుల్లో వీణ తీగ. తను పలికితే ఎవరికైనా బాగానే ఉంటుంది"

క్రికెట్టు ఆడారు. అంత్యాక్షరి ఆడారు. ఓ హిందీ సినిమాలో చూపినట్టు రికార్డ్ ఆన్ చేసి దిండుని ప్రక్కవాళ్ళకి విసురుతూ ఆడారు. ముందుగా ఔటయ్యాడు సూర్యం.

"మా ఆవిడ అంతసేపూ దిండుని తన దగ్గర ఉంచుకుని, తీరా రికార్డ్ ఆగేముందు నా మీదకి విసిరింది. నాకు అన్యాయం జరిగిపోయింది" సూర్యం వాపోయాడు.

"మామయ్యా! అత్తయ్యని చేసుకున్నప్పుడే మీ జీవితానికి సరైన న్యాయం జరిగింది. వేషాలు వేయక మిమిక్రీ చేయండి" అంది మేఘ.

"నేనా?" ఆశ్చర్యంగా అడిగాడు.

"అంతగా నటించద్దు మాధవ పెద్ది, భానుమతి, ఎల్.ఆర్.ఈశ్వరి వంటి పాతగాయకుల్ని మీరు అనుసరించి పాడ్డం నాకు తెలుసు" అంది మేఘ.

కాస్సేపు బ్రతిమాలించుకుని "మనసున మల్లెల మాలలూగెనే" అంటూ పాడాడు.

తరువాత ఓడింది తాతగారు. "తాత దేనికి ట్రేడ్ మార్కు?"

"దగ్గుకి"

"సరే నేను ఇరవై రకాల దగ్గులు వినిపిస్తాను" అంటూ పొడిదగ్గు, జలుబు దగ్గు, కోరింత దగ్గు, అలికిడి దగ్గు, తన ఉనికిని తెలిపే దగ్గు, హేళనదగ్గు, తిరగమోత దగ్గు అంటూ వినిపించాడు.

శివ వాళ్ళమ్మ భగవద్గీత శ్లోకాలు, అతని అమ్మమ్మ త్యాగరాజ కృతి, వాళ్ళనాన్న యమధర్మరాజు డైలాగులు చెప్పారు. జయ ఆరు భాషల్లో రైల్వే ఎనౌన్స్‌మెంట్ చేయగా, అంబరీష్ వీణ డాన్స్ చేశాడు. చాలా చిత్రంగా దివ్య, శివ దిండుని అలాగే పట్టుకుని ఒకేసారి ఔటయ్యారు.

"ఇద్దరూ ఓడారు" సభ తీర్మానించింది.

"నాకేమీ రావు" అంది దివ్య.

"రాకేం? మగాళ్ళ మీద మంచి 'విసురు' విసిరేయ్!" అంది మేఘ.

"మగవాళ్ళు తమ లోపాల్నుండి తాము పారిపోవడానికి ప్రయత్నిస్తారు. అందుకే వారు ఏకాంతంగా గడపలేరు. నలుగురిలో ఇమడలేరు" అంది. 'ఇంక వీణ్ణి అడగాల్సిన అవసరం ఉండదు' అనుకున్నాడు రామారావు. అంతే! శివ అందుకున్నాడు. "ఆడవాళ్ళు పదిమందిలో ఉన్నప్పుడు ఏకాంతం గురించి కలలు కంటారు. ఏకాంతంగా ఉన్నప్పుడు పదిమందిని గురించి ఆలోచిస్తారు" అన్నాడు.

అంతే. చప్పట్లు మోగాయి. తిరిగి ఆటమొదలయ్యింది. సిరియాళ్ ఓడాడు.

"మీరంతా వాక్పమత్కారులు. ఏవేవో చెప్పారు. నా కలా రాదు. కళ్ళు మూసుకుని మన ముఖ్యమంత్రి బొమ్మ వేయనా?"

"రోజూ పేపర్లో అవన్నీ చూస్తున్నాం కళ్ళు మూసుకుని అందమైన అమ్మాయి బొమ్మవెయ్యి" అన్నాడు రామారావు.

"భయ్యా!" అంటూ ఇబ్బందిగా కదిలాడతను.

"అమ్మాయి బొమ్మ వేయాలి" అరిచారంతా. అంతే. క్షణాలమీద పాడ్, పేపర్, పెన్ను పంపించింది మేఘ. కళ్ళుమూసుకుని వేశాడంతే. అతను కళ్ళు తెరిచేసరికి పేపర్ రామారావు చేతిలో ఉంది. సిరియాళ్‌కి తప్పించి అందరికీ చూపాడది.

"భయ్యా! నే చూడద్దూ?"

"వద్దు. నీ కలల సుందరిని నీ కళ్ళలోనే ఉండనీ. నీ పెళ్ళిరోజు ఇది నీకు బహుమతిగ ఇవ్వబడుతుంది" అంటూ మడిచి జేబులో పెట్టుకున్నాడు రామారావు.

మేఘ ఓడింది. "చెప్పండి, ఏం చేయాలో" అడిగింది.

"నీ కలల రాకుమారుడి మీద కవిత చెప్పు."

"అలాగే."

**"కలల రాకుమారునికి కనకపు సింహాసనం -**
**హృదయాన్ని చూపమంది మనోదర్పణం.**
**ప్రేమలేఖ రాయాలనే ఉంది. కానీ**
**కాళిదాసునుండి - ఆధునిక కవిదాకా**
**వాడి వాడి అరిగిపోయిన అక్షరాలు**
**తోడి తోడి తరిగిపోయిన భావాలు.**
**మరేం చేయాలి? మనస్సు నెలా తెలపాలి?**
**అందుకే రాశాను. నిశ్శబ్దంలో సశబ్దగీతం.**
**ఎక్కడుంది? మౌనాన్ని మించిన మనోజ్ఞమైన పదం"**

అంతా చప్పట్లు కొట్టారు. "మేఘా! ఈ నిశ్శబ్దగీతం నీ కలల రాకుమారునికి చేరాలని మేమంతా కోరుకుంటున్నాం" అన్నారు తాతగారు. ఈసారి విభీషణ ఓడాడు. "నేనేం చేయాలి?"

"ఉందిగా నీ మకారాయణం. మకారాలు ఎక్కువగా ఉన్న పద్యం చదివి వివరించు" అన్నాడు రామారావు.

**కం: మామా వలువలు ముట్టకు**
**మామా కొని పోకు పోకు మన్నింపదగున్**
**మా మావ మేలగొనియెదు**
**మా మానస హరణ మేల మామము కృష్ణా.**

ఇది పోతనగారి 'టూ ఇన్ వన్' పద్యం. ఈ పద్యంలో గోపికలు కృష్ణుని స్మరిస్తున్నారు. 'మీరు కృష్ణుని స్మరించండి. నేను పలుకుల తల్లిని ప్రస్తుతిస్తాను' అంటూ సరస్వతీదేవికి ఇష్టమైన పదునాలుగు (14) సంఖ్యలో 'మ'కారాలనుంచి 'మా' అంటూ మాతయైన దేవిని మకారంతోస్తుంటారు. పద్యాన్ని ఎత్తుకోవడమే 'మా' అంటే 'తల్లీ' అని ఎత్తుకున్నారు. తనకావ్యం సజావుగా సాగుతున్నందుకు సరస్వతీదేవిని 'అంతర్వాహిని'గా స్తుతించిన పద్యం ఇదని నేను నమ్ముతాను" అన్నాడు.

"భేష్", "శభాష్" "వారెవ్వా" అంటూ అంతా మెచ్చుకున్నారతన్ని. ఘనంగా చప్పట్లు కొట్టి అభినందించారు.

"బావా ఇక నీ వంతు" అంది మేఘ.

"నే గెలిచాను. గెలిచినవారు ఏమీ చేయనవసరం లేదు" అన్నాడతను.

"అదేం కుదర్దు" అంది మేఘ. చాలాసేపు ఆమెతో వాదించి "అబ్బబ్బ నీ వంటి గయ్యాళిని ఎవరుచేసుకుంటాడో గానీ వాడు ఇనుపమేకుల పూజచేస్తున్నాడు దేవుడికి" అన్నాడు. సిరియాళ్ వెంటనే చేతిని వెనక్కి లాక్కున్నాడు. ఇందాక పాడ్‌కి పెట్టడానికిచ్చిన గుండుసూదుల్ని తమ్ముడి చేతిలో ఉన్న బంతికి గుచ్చి తమ్ముడూ తనూ నిశ్శబ్దంగా ఆడుకుంటున్నారు.

"అదేంటి? ఇందాకేగా బంగారు పూల పూజ చేస్తున్నాడని మెచ్చుకున్నారు" మేఘ పోట్లాడింది.

"అది తూచి అమ్మాయ్! ఇదే నిజం."

"మీరిలా నిముషానికో రకంగా చెప్పి అసలే అయోమయంలో ఉన్నవాళ్ళని మరింత అయోమయం లోకి గెంటద్దు" అంది.

"సరే. సరే. ఈసారి అలాగే చేస్తాం కాని ఇప్పుడేవంటావ్?"

"నువ్వేమైనా చెప్పు. పాటపాడు. ఆటాడు. నీ ఇష్టం."

"సరే! నాక్కొద్దిగా జ్యోతిష్యం తెలుసు. ఇక్కడున్న మీరు, ఇంకా మరికొందరు, ఇంకొందరూ మీ బంధువులు, స్నేహితులు, హితులు అంతా ఆపదల పాలుకాబోతున్నారు. అంతా చిక్కుల్లో పడనున్నారు. అది రేపుకావచ్చు. సంవత్సరాలే పట్టచ్చు. కానీ ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని గడిపే చిక్కులు మీకు రానున్నాయి. మీకలాంటి జీవన్మరణ సమస్య కలగడానికి కారణం ఊహించగలరా?"

అంతా చూస్తున్నారు ఆశ్చర్యంగా వింటున్నారు. హృదయాన్ని చెవులకి అప్పగించి.

"అందుకు కారణం నేనే. ఔను. నా కారణంగానే మీరంతా చిక్కుల్లో చిక్కనున్నారు. దయచేసి వివరాలూ, కారణాలు నన్నడక్కండి. విషయం ఏంటో నాకూ తెలియదు మరి" అంటూ లేచాడు.

అక్కడున్న వాళ్ళందరికీ తెలుసు. అతను అంతకన్నా ఓ మాటకూడా ఎక్కువగా చెప్పడనీ తామూ చెప్పించలేమనీను.. అందుకే మౌనాన్ని బలవంతంగా పారదోలే ప్రయత్నం చేస్తూ అందరూ మాట్లాడ్డానికి ప్రయత్నిస్తున్నారు. పెదాల చివర్నుండి వస్తున్న ఆ మాటలన్నీ పేలవంగా వినబడుతున్నాయి రామారావుకి.

●●●

శివ క్వాలిస్ కొన్నాడు. ఈ విషయం ముందే విన్న రామారావు "మీ ఇంట్లో ఉన్న ఐదుగురికి అంత పెద్ద బండి ఎందుకు? ఇప్పుడు మంచి మోడల్ కార్లు చాలా వస్తున్నాయి కదా?" అన్నాడు.

"ఇది కొత్తబండేం కాదు. కానీ ఎక్కువగా తిరిగింది లేదు. ఆ ఓనర్లకి మరో నాలుగు బండ్లున్నాయి. ఆపద సమయంలో ఆయన ప్రాణాలు రక్షించానన్న కృతజ్ఞతతో 'డాక్టర్ గారూ మీకు బండికావాలి. చాలా తక్కువ ధరకిస్తాను. కొనుక్కోండి. అపుడు నాలాంటి ప్రాణాలు మరిన్ని కాపాడచ్చు' అంటూ పోరుతున్నాడు. నాకూ నిజమే అనిపించింది. పైగా మనందరం బైటికి వెళ్ళాలంటే పెద్ద బండి ఏదైనా కావాలి. అందుకే కొంటున్నాను. నిజానికి మనకిది కూడా సరిపోదు కానీ కనీసం ఆడవాళ్ళైనా ఎండ కన్నెరగక వస్తారని కొంటున్నా" అన్నాడు.

"అవునులే. మనిద్దరికీ బైక్ లున్నాయికదా?"

"బండి పాతదైనా పూజ చేయించాలి" అన్నాడు శివవాళ్ళ నాన్న. ఊరికి చివరగా ఉన్న అమ్మవారి ఆలయంలో పూజ చేయించారు. అంతా బండిలో ఇరుక్కుని సర్దుకున్నారు. శివ, రామారావు బైక్ మీద వెనకాల బైలుదేరారు. నగరానికి కాస్త దూరంలోనే

ఉన్న ఆ గుడి నుండి బయలుదేరేప్పటికే రాత్రి ఏడుదాటింది. క్వాలిస్ వెళ్ళిపోయింది. శివ, రామారావు కాస్త నెమ్మదిగా వస్తున్నారు. సిటీ మరో ఐదు కిలోమీటర్ల దూరంలో ఉండగా ఉన్నట్టుండి బండి ఆపాడు రామారావు. "ఏంట్రా ఆపావు?" అడిగాడు శివ.

బండికి స్టాండ్ వేసి పరుగెత్తుతూ వెనక్కి నడిచాడు రామారావు. అక్కడ రోడ్డుకి కొద్ది దిగువలో ఓ కారు చెట్టుని ఢీకొని ఉంది. డ్రైవరు అచేతనంగా దూరంగా పడి ఉన్నాడు. ఇద్దరూ అటుగా పరుగెత్తారు.

"బాబోయ్! ఇతను పోయాడు" అన్నాడు శివ.

చెట్టు ఆధారంగా అడ్డంగా పడిపోయింది కారు. శివ జేబులో నుండి సెల్ తీసి పోలీసులకి ఫోన్ చేస్తున్నాడు. అది ఎంగేజ్ వస్తోంది. సహాయం కోసం ఎవరైనా వస్తారేమోనని రామారావు రోడ్డు మీదకి వచ్చి చూస్తున్నాడు. అంతలో పోలీస్ జీప్ కనిపించింది. "ఇక్కడ" అంటూ చేయి చాపి ఆపాడు రామారావు.

"ఇక్కడ ఏదో యాక్సిడెంట్ అయిందని ఎవరో ఫోన్ చేశారు. మీరేనా ఫోన్ చేసిన వాళ్ళు?" అడిగాడు ఒకతను.

"లేదు. మేం ఇప్పుడే వస్తూ చూశాం. మీకు ఫోన్ చేస్తున్నాను కూడా" అన్నాడు శివ. పోలీసుల వెనకే పత్రికల వాళ్ళు, చానళ్ళ వాళ్ళు వచ్చారు. అంతా చనిపోయిన వ్యక్తి చుట్టూ గుమికూడారు. ఓ విలేఖరి కారు దగ్గరికి వెళ్ళి చెప్పాడు. "కార్లో ఎవరో ఉన్నారు" అని.

అంతా అటు చేరుకుని కారు డోర్‌ని బలంగా లాగితే గాయాలతో స్పృహ తప్పి ఉన్న యువతి కనబడింది. శివ ఆమె నాడి పరీక్ష చేసి "త్వరగా వైద్యం చేస్తే ఈమె బ్రతకొచ్చు" అన్నాడు.

"మీరు డాక్టరా?" అన్నాడు యస్సై.

"అవును" శివ అన్నాడు.

"ఇక్కడికి రెండు కిలోమీటర్ల దూరంలో ఓ హాస్పిటలుంది. ఈమెతో పాటు మీరు మా జీప్‌లో వెళ్ళగలరా?" యస్సై అడిగాడు.

"తప్పకుండాను. ఈమెని జీప్‌లోకి చేరుద్దాం" అన్నాడు శివ.

"నాకిక్కడ కొన్ని పనులున్నాయి. అవి పూర్తిచేసుకుని నే హాస్పిటల్‌కి వస్తాను. ఈలోగా ఆమెకి ట్రీట్‌మెంట్ జరిగేలా చూడండి" అంటూ డ్రైవర్‌ని మరో కానిస్టేబుల్‌ని ఇచ్చి పంపాడు యస్సై.

పోలీస్ జీప్ కొంత సేపు అయాక డాక్టర్ వచ్చి ప్రాణభయం లేదని చెప్పాడు. తలవెనుక భాగంలో చిన్న గాయానికి కట్టుకట్టారు. ఎడమ, చేతికి కుట్లు వేశారు. ఐనా ఆమెకి స్పృహ రాలేదు.

శివని ఇంటికి పంపించి, సెలైన్ ఎక్కించిన ఆమె చేతిని అలాగే పట్టుకుని రాత్రంతా అక్కడే ఉండిపోయాడు రామారావు. మధ్యలో ఒకటి రెండు సార్లు ఆమె కళ్ళు తెరచి చూసి మళ్ళీ మూసుకుంది.

*(కొనసాగింపు వచ్చేసంచికలో)*

Post your comments